పాడికి జీవం..రైతన్నకు ఊతం

- రబీ సాగుతో పుష్కలంగా పశుగ్రాసం
- పెరిగిన పాల దిగుబడులు
- అమూల్ రాకతో పెరిగిన పాల ధరలు
- ఆనందంలో పాడి రైతులు


ట్రాక్టర్‌లో గడ్డిని తరలిస్తున్న పాడిరైతులు

పొదలకూరు : రబీ సాగు పాడిపరిశ్రమకు జీవం పోసింది. పశువులకు పశుగ్రాసం పుష్కలంగా లభించడంతో పాల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో అమూల్ డెయిరీ రాకతో పాల ధరలు పెరగడంతో పాడి రైతులు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికస్వావలంబన పొందుతున్నారు. గత నాలుగేళ్లుగా వర్షాలు బాగా కురుస్తుండడం..సాగు నీరు పుష్కలంగా విడుదల చేస్తుండడంతో మండలంలో రబీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో పశువుల మేతకు ఉపయోగించే ఎండుగడ్డి బాగా లభ్యం అవుతోంది. వర్షాలతో మేత పొరంబోకు భూముల్లోనూ పచ్చిగడ్డి లభ్యం అవుతోంది. ఫలితంగా పాల దిగుబడి ప్రతి ఏడాది గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రతి రైతు రెండు గేదెలను మేపుకొంటే కుటుంబం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుందనే ఉద్దేశంతో పాడిని నమ్ముకుంటున్నారు.

తగ్గిన ఎండు గడ్డి ధరలు..పెరిగిన పాల ధరలు

గతంలో కరువు, కాటకాలతో రైతులు గేదెలను తెగనమ్ముకున్నారు. ప్రస్తుతం వ్యవసాయం కన్నా పాడిపరిశ్రమే మేలని చాలామంది రైతులు డెయిరీఫామ్స్‌ను నిర్వహిస్తున్నారు. వరిసాగు పెరగడంతో ఎండు గడ్డి ధరలు తగ్గిపోయాయి. మోపు గడ్డి రూ.150 నుంచి రూ.175 వరకు పలుకుతుండగా, ట్రాక్టర్‌తో గడ్డిని తోలుకునేందుకు మరో రూ.5 వేల వరకు పాడిరైతులు వెచ్చిస్తున్నారు. డెయిరీఫామ్స్ ఏర్పాటుకు బ్యాంకులు సైతం రుణాలు మంజూరు చేసేందుకు ముందుకొస్తున్నాయి. ప్రభుత్వం అమూల్‌తో కలిసిన తర్వాత పొదుపు మహిళల నుంచే కాక పాడి రైతుల నుంచి పాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం డెయిరీలు 10 శాతం వెన్న ఉంటే లీటర్ పాలకు రూ.77 చెల్లిస్తున్నాయి.


డెయిరీఫామ్‌లోని ఆవులు

మూడు శీతలీకరణ కేంద్రాలు

మండలంలో ప్రైవేట్ పాల శీతలీకరణ కేంద్రాలు కూడా ఉన్నాయి. తోడేరు పంచాయతీ పరిధిలో హెరిటేజ్, దుగ్గుంట పంచాయతీలో శ్రీనివాస డెయిరీ పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల పొదలకూరులో ఓ శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏజెంట్ల ద్వారా పాలను సేకరిస్తుంటారు. ఇక్కడి నుంచి బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని మెయిన్ డెయిరీలకు పాలను ఎగుమతి చేస్తున్నారు.

పాల దిగుబడులు పెరిగాయి



గత మూడేళ్లుగా మండలంలో పాల దిగుబడులు పెరిగాయి. అమూల్ డెయిరీ రాకతో పాల ధరలు పెరగడంతో పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రెండు గేదెల పోషణతో అప్పు చేయకుండా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పశువుల ఎరువును నిమ్మతోటలకు వేస్తుండడంతో బాగా ధర పలుకుతోంది. ఫలితంగా రెండు విధాలుగా పాడిగేదెల వల్ల రైతులు లాభపడుతున్నాడు.

–సీహెచ్ రమేష్, రైతు, నావూరుపల్లి.

పాడి గేదెలకు టీకాలు

పాడిగేదెలకు గాలికుంటు, ఇతర వైరస్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నాం. పశులకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే రైతు నష్టపోకుండా వెంటనే బీమా నగదు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సీహెచ్ మురళీకష్ణారెడ్డి,
పశువైద్యాధికారి,
తాటిపర్తి,

పెరిగిన పాల దిగుబడులు

పొదలకూరు మండలంలోని తాటిపర్తి, మహ్మదాపురం, సూరాయపాళెం, విరువూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం, తదితర పెన్నార్ డెల్టా గ్రామాల్లోని రైతులు పాడిని నమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మండలంలో 26 వేల గేదెలు, 2,500 తెల్ల పశువులు(ఆవులు, ఎద్దులు) ఉన్నాయి. వీటిలో పాలు ఇచ్చే గేదెలు, ఆవులు సుమారు 10 వేల వరకు ఉన్నాయి. వీటి ద్వారా పాడిరైతులు ప్రతి నిత్యం సుమారు 30 వేల లీటర్లను పాలను సేకరిస్తున్నారు. 20 వేల లీటర్ల పాలను విజయ డెయిరీ, ప్రైవేట్ డెయిరీలకు నిత్యం పోస్తున్నారు. మిగిలిన 10 వేల లీటర్ల పాలను స్థానికంగా అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రెండు గేదెలున్న రైతులు కుటుంబ ఖర్చులకు ఇబ్బంది పడకుండా జీవిస్తున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొడవలూరు: చంద్రశేఖరపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టీ విష్ణుప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 60 సీట్లు ఉండగా, 30 సీట్లు బాలికలు, 30 సీట్లు బాలురకు కేటాయించినట్లు చెప్పారు. అలాగే 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామని చెప్పారు. 7వ తరగతిలో బాలురు 10, బాలికలు 2, 8వ తరగతిలో బాలురు 1, 9వ తరగతిలో బాలికలు 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 30న గురుకులంలో రాత పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు 90101 75322 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మనుబోలమ్మకు శఠారి బహూకరణ



మనుబోలు: మనుబోలు గ్రామ దేవత మనుబోలమ్మకు గ్రామానికి చెందిన బడుగు రవీంద్ర రూ.30వేల విలువైన వెండి శఠారిని ఆదివారం బహూకరించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ మనుబోలమ్మకు పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శఠారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

కొత్తూరులో ఉచిత వైద్య శిబిరం



ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన హేమలతారెడ్డి న్యూరో స్పెషాలిటీ సెంటర్ డాక్టర్ హేమలతారెడ్డి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పక్షవాతం, మూర్ఛ, తదితర వ్యాధుల లక్షణాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

సెంబ్‌కార్ప్ ఆధ్వర్యంలో..



ముత్తుకూరు: నేలటూరులోని సెంబ్‌కార్ప్ పవర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ముసునూరువారిపాళెంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముసుకూరు జనార్దన్‌రెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్య నిపుణులు కే అవినాష్, పీ శేషితారెడ్డి, జీ రాధాకృష్ణ, తదితరులు దంత, చెవి, ముక్కు, గొంతు, గర్భకోశ సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు మునుకూరు సుధీర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నటాన్ సుభాన్‌బాషా, బూత్ కన్వీనర్ నడవడి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జెడ్పీటీసీ సతీమణి మృతి



ముత్తుకూరు: మండల జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య సతీమణి వెంకటరమణమ్మ(39) గుండెపోటుతో స్వగ్రామమైన గోవిందరెడ్డిపాళెంలో ఆదివారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వెంకటసుబ్బయ్యను ఓదార్చి ధైర్యం చెప్పారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ముత్తుకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తుల గడువును నెలాఖరు వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినా, మరోసారి నెలాఖరు వరకు పొడిగించినట్టు చెప్పారు. ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెం: రామచంద్రాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ కే జయలక్ష్మి ఆదివారం తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 24వ తేదీతో గడువు ముగిసినా, మరింత మంది విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు: మండలంలోని పోలంరాజుగుంటలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవూరు (విడవలూరు): విడవలూరు మండలం రామతీర్థంలోని పాతూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం ఉదయం 7గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని గురివిందపూడిలో ఆదివారం ఆయన పర్యటించారు. రూ.60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తొలుత మన్నెమాల సుధీర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.2,750 పింఛన్ అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. అమ్మఒడి, రైతుభరోసా, చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, వాహనమిత్ర, జగనన్న చేదోడు. కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. మరోవైపు అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపడుతున్నారని వివరించారు. గురివిందపూడిలో నాలుగేళ్లలో రూ.3.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ నాలుగేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నాం కాబట్టే గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో నేరుగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజలకు అవసరమైన పనులు చేపడతామన్నారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ మన్నెమాల సమతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నెమాల వసంతకుమార్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, గిద్దంటి రమణయ్య, కేవీఆర్ గౌడ్, మహేంద్రవర్మ, సురేందర్ రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులు ఐక్యంగా ఉండాలి


ఐకమత్యాన్ని చాటుతున్న డప్పుకళాకారులు

పొదలకూరు : జిల్లాలోని డప్పు కళాకారులు ఐక్యంగా ఉండాలని జిల్లా జానపద కళావేదిక కార్యదర్శి తల్లు సేనయ్య అన్నారు. మండలంలోని తోడేరు ఎస్సీకాలనీలోని డప్పు కళాకారులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేనయ్య మాట్లాడుతూ వివిధ కార్యక్రమాలకు వెళ్లే డప్పు కళాకారులు గౌరవమైన వేతనాలను పొందాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం నుంచి సౌకర్యాలు పొందేందుకు ఐకమత్యంగా ఉండాలన్నారు. డప్పు కళాకారులకు బీమా సౌకర్యం కల్పించాలని , 40 ఏళ్లకే పింఛన్ పొందే అర్హతను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అలుపూరు లోకేష్, పోలయ్య, ప్రసాద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయాల నిర్మాణం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


భూమిపూజలో పాల్గొని ఇటుకలు అందిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో సర్వేపల్లి నియోజకవర్గంలోని పేదల కాలనీల్లో 50 దేవాలయాలను నిర్మించడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మహ్మదాపురంలోని సర్కార్‌తోపు వద్ద శ్రీరాధాకృష్ణ మందిరం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో 28 దేవాలయాలకు రూ.2.80 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. మరో 22 దేవాలయాలను నిర్మించి 50 ఆలయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తానన్నారు. టీటీడీ సహకారంతో ప్రతి దేవాలయానికి రూ.10 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొస్తే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పొదలకూరు మండలంలో చిట్టేపల్లి, చాటగొట్ల, విరువూరు ఇసుకపాళెం, విరువూరు జొన్నమిట్టకాలనీ, అమ్మవారిపాళెం, మహ్మదాపురం, డేగపూడి, వరదాపురం, మరుపూరు గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.90 లక్షలు మంజూరు చేయించామని వివరించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దేవాలయాల నిర్మాణానికి సీఎం ఔదార్యం

సాధారణంగా టీటీడీ వెంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి దేవస్థానాల నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరు చేస్తుందని మంత్రి కాకాణి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుళ్లంతా సమానమేనని, అందరి మనోభావాలను గౌరవించి ఏ దేవాలయం నిర్మాణానికైనా నిధులు మంజూరు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో టీటీడీ పేదల కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి ముందుకొచ్చి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ ప్రత్యూష, ఉపసర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు బొడ్డు మాలకొండారెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు రాజా, పీ అనిల్, పీ లోకేష్, జీ శ్రీకాంత్, ఏ మల్లికార్జున్, ఎం నాగరాజు, ఎం అనీల్, టీ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కోవూరు: కోవూరులోని పీవీఆర్ కల్యాణ మండపంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కోవూరు టీఎస్‌సీ హైస్కూల్‌లో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గతస్మృతులను నెమరువేసుకున్నారు. తమ గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, రఘుపతి బలరామ్, పెంచలరావు, మల్లికార్జునరెడ్డి, ఇస్మాయిల్‌ను గురువులు ప్రత్యేకంగా అభినందించారు. 36 ఏళ్ల తరువాత స్నేహితులను కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకోవడం ఎంతో అనుభూతినిచ్చిందని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు.

ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని బాలుడు



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని దేవసేనమ్మ ఆస్పత్రి వద్ద సుమారు ఆరేళ్లు కలిగిన గుర్తుతెలియని బాలుడ్ని ఆదివారం రాత్రి స్థానికులు గుర్తించారు. ఇంటి నుంచి తప్పిపోయి ఆస్పత్రి వద్దకు చేరుకున్న బాలుడు ఏడుస్తుండగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వీర ప్రతాప్ తన సిబ్బందితో కలిసి ఆస్పత్రి వద్దకు చేరుకుని బాలుడి నుంచి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. బాలుడు వివరాలు చెప్పలేకపోవడంతో స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి వివరాలు తెలిసిన వారు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారికి పురస్కారం


అవార్డు అందుకున్న వైద్యాధికారి రామకృష్ణ

కొడవలూరు: క్షయ నియంత్రణకు విశేషంగా కృషి చేసినందుకు గానూ కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణకు పురస్కారం లభించింది. పీహెచ్‌సీ పరిధిలో ఎక్కువ మంది క్షయ రోగులను గుర్తించి చికిత్స అందించడంతో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం రామకృష్ణ మాట్లాడుతూ క్షయ లక్షణాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా రోగులు ప్రాథమిక దశలోనే పీహెచ్‌సీకి వచ్చేలా చేయడం జరిగిందన్నారు. తద్వారా ప్రాథమిక దశలోనే క్షయను నివారించడం జరిగిందన్నారు. క్షయ నియంత్రణలో తనకు సహకారం అందించిన వైద్య సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

చకచకా బాక్స్‌టైప్ అండర్ బ్రిడ్జి పనులు


అండర్ బ్రిడ్జి పనులు చేపడుతున్న దృశ్యం

కొడవలూరు: మండలంలోని టపాతోపు రైల్వేగేటు వద్ద బాక్స్‌టైప్ అండర్ బ్రిడ్జి పనులు చకచకా సాగుతున్నాయి. కొడవలూరుతో పాటు అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్లేందుకు ఈ గేటు మార్గం ఎంతో కీలకమైంది. కొడవలూరు వద్ద మరో రైల్వేగేటు ఉన్నప్పటికీ నార్తురాజుపాళెం మీదుగా వెళ్లాల్సి రావడంతో దూరంతో పాటు ట్రాఫిక్ సమస్య ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రూ.11 కోట్ల అంచనా వ్యయంతో టపాతోపు రైల్వే గేటు వద్ద రైల్వేశాఖ బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మార్గానికి ఉన్న ఆవశ్యకత దృష్ట్యా దీనిని నెలరోజుల్లోనే అందుబాటులోకి తేవాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగానే బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో పనులు ఆరంభించగా ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశారు. పట్టాల కింద గుంత తీయడంతో పాటు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారు. పట్టాల వద్ద నుంచి హైవేను కలిపే మెయిన్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి వచ్చే నెల మొదటి వారంలో అందుబాటులోకి తేవాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ఈ అండర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మూడు మండలాల ప్రజల రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది.

29 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



కోదండరామస్వామి ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని పది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. 1784లో దొడ్ల రామిరెడ్డి నిర్మించిన ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా రాతి కట్టడం కావడం విశేషం. ఈ ఆలయానికి ముందు ఉన్న వంద అడుగుల గాలిగోపురం రాష్ట్రంలోని రెండో అతిపెద్ద గోపురంగా ప్రసిద్ధికెక్కింది. ఆలయంలో శ్రీచతుర్భుజ లక్ష్మి, శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆండాల్, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయానికి బయట దాదాపు 2.5 ఎకరాల్లో కోనేరు ఉంది. బ్రహ్మోత్సవాల్లో దాదాపు 40 అడుగుల ఎత్తు రథాన్ని వినియోగించనున్నారు.

ఉత్సవాలు ఇలా..

ఈ నెల 29న అంకురార్పణ, 30న ధ్వజారోహణం, శేషవాహన సేవ, 31న హంస వాహన సేవ, ఏప్రిల్ 1న యాళీ వాహన సేవ, 2న హనుమంతసేవ, 3న గరుడసేవ, 4న కల్యాణోత్సవం, 5న రథోత్సవం, తెప్పోత్సవం, 6న అశ్వవాహన సేవ, 7న ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 8న ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



శ్రీరామనవమి సందర్భంగా పది రోజుల పాటు నిర్వహించే కోదండరామస్వామి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

-దొడ్ల మురళీకృష్ణారెడ్డి,
ఆలయ చైర్మన్